

అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా అందని పౌష్టికాహారం 7లో
7లో గోత్రాలగూడెం గోసలు తీరేదెప్పుడో..

కొత్త జిల్లాలు ఉండాలంటే
బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాలి



- పల్లె, పట్టణ ప్రకృతి వనాల్లో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి
- చెన్నూరు ఎత్తిపోతల పథకం ఎత్తేశారు
- కేసీఆర్, న్యూట్రిషన్ కిట్లు బంద్ పెట్టారు
- సింగరేణి కార్మికుడు కొప్పుల ఈశ్వర్‌కు మద్దతు ఇవ్వండి
- మంచిర్యాల రోడ్ షోలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

మంచిర్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు అలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శనివారం రాత్రి నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ 26 ఏళ్లపాటు సింగరేణి కార్మికుడిగా ప్రజలందరికి తెలిసిన వ్యక్తి అని, గని కార్మికుల సమస్యలేంటో తెలిసిన వ్యక్తికి ప్రజలు మద్దతు పలకాలన్నారు. బీఆర్ఎస్ పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందని, పల్లె, పట్టణ ప్రగతి పథకాలు మాయమయ్యాయని అన్నారు. పల్లెల్లో, మున్సిపాలిటీల్లో రోడ్లు ఊడ్చే పరిస్థితి కూడా లేదని, క్రీడాప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు కొట్లాడుతున్నాయని అన్నారు. చెన్నూరు డివిజన్‌లో బీఆర్ఎస్ హయాంలో రైతులకు సాగునీరు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తేసిందని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం మొండి గోడలతో ఉందన్నారు. ఆ భవనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ కారణంచేత ఆపివేసిందని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను విభజించి ప్రజల సౌకర్యార్థం మరో మూడు జిల్లాలుగా మార్చామని, ప్రస్తుత ప్రభుత్వం మంచిర్యాల, నిర్మల్ జిల్లాలను రద్దు చేస్తానని అంటోందన్నారు. మంచిర్యాల జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని, అది ఉండాల్నా ? పోవాల్నా ? అని ప్రశ్నించారు. జిల్లా ఉండాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కేసీఆర్ అన్నారు. సింగరేణి తెలంగాణ కొంగుబంగారమని, కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తే దానిని కాపాడుతారని అన్నారు. ముఖ్యమంత్రి నీ గుడ్లు పీకుతా, పేగులు మెడలో వేసుకుంటా, జైలుకు పంపుతా అని పదే, పదే నన్ను ఉద్దేశించి అంటున్నాడని, జైళ్లకు కేసీఆర్ భయపడతాడా అని అన్నారు. 15 ఏళ్ల రాజీలేని పోరాటం చేసి తెలంగాణ తెచ్చానని, రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రాణాలు బలి పెట్టయినా పోరాడుతానని స్పష్టం చేశారు. ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తానని, రైతుల ఆదాయం పెరిగేలా చేస్తానన్న మోదీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మోదీది ఉత్త గ్యాస్ కంపెనీ అని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ ఆగర్భ శ్రీమంతుడు, భూగర్భ కార్మికుడి మధ్యే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ఉద్దేశించి అన్నారు. కార్మికుడైతే ప్రజల పక్షాన ఉంటాడని, ఇద్దరిలో ఎవరు గెలవాలో ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు. రోడ్ షోలో చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్యతో పాటు స్థానిక నాయకులు సీపతి శ్రీనివాస్, సందెల వెంకటేష్, యువ నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ పాల్గొన్నారు. మానుకోట ప్రసాద్ బృందం ఆలపించిన గీతాలు ప్రజలను ఆద్యంతం ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

కాంగ్రెస్‌తోనే సుస్థిరపాలన



కొండాపూర్ సభలో అభివాదం చేస్తున్న వినోద్, వివేక్, వంశీ



తాండూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ

కాసిపేట, మే 4: కాంగ్రెస్ పార్టీతోనే సుస్థిరపాలన అందుతుందని బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. శనివారం కొండాపూర్‌యాపలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణ ఆకాంక్షలను తుంగలో తొక్కిన బీఆర్ఎస్, ప్రజా సంక్షేమం మరిచి దేశ సంపదను ఆదాని, అంబానీలకు పంచి పెడుతున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడి 1200 మంది యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని, కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం అప్పులకుప్పగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పుల పాలైతే కేసీఆర్ కుటుంబం ఆస్తులను కూడబెట్టుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. ఆగస్టు 15లోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. మహాలక్ష్మీ పథకాన్ని ఎన్నికల కోడ్ ముగియగానే అమలు చేస్తామన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజలందరు ఆశీర్వదించి తనను పార్లమెంట్‌కు పంపితే కేంద్రం నుంచి నిధులు తెచ్చి ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే సొంతంగా బైక్‌ల తయారీ కంపెనీ ఏర్పాటు చేసి 500 మందికి ఉద్యోగాలు కల్పించానని తెలిపారు. కాకా కుటుంబం పదవుల్లో లేనప్పటికి విశాఖ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు రత్నం ప్రదీప్, గడ్డం జగన్నాథం, మేరుగు పద్మశంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు లబ్ధి

తాండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అంది లబ్ధి పొందుతారని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. కిష్టంపేట, తాండూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పథకాలు అమలులో పూర్తిగా విఫలమ య్యారన్నారు. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఉపాధిహామీ పథకం ప్రారంభమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు న్యాయం జరగలేదని, నాయకులు, కార్యకర్తలు మాత్రమే బాగు పడ్డారని తెలిపారు. ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసిందని, త్వరలో రైతులకు రుణమాఫీ, మహిళలకు ప్రతీ నెల రూ.2500 నగదు అందిస్తామన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కాం గ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పలువురు బీఆర్ ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వా నించారు.

జైపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మండలంలోని ఇందారంలో ఉపాధిహామీ కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్ని కల్లో హస్తం గుర్తుకే ఓట్లు వేసి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని సూచించారు.

మందమర్రిటౌన్: బీజేపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని, పరిశ్రమల మూసివేత, నిరుద్యోగం పెరిగిపోయిందని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు పరిశ్రమలను జాతీయీకరణ చేస్తే మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత లాభాల్లో ఉన్న వాటిని ప్రైవేటు పరం చేశారని మండిపడ్డారు. గడ్డం వంశీ వివేక్‌ను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, పాల్గొన్నారు. పట్టణంలోని ఊరు రామకృష్ణాపూర్‌లో ఊరు కొలుపునకు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి హాజరయ్యారు.

ఏసీసీ: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు జాతీయ మాలమహానాడు నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలు హాజరయ్యారు పైడిమల్ల నర్సింగ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీమెజార్టీతో గెలిపించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, ఒడ్నాల కొమురయ్యలు కోరారు. చిర్రకుంటలో ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. విజయ, పెద్దల రాజయ్య, పాల్గొన్నారు.


దండేపల్లి: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఉపాధి హామీకి గ్యారంటీ ఉంటుందని నాయకులు ఆకుల రాజేందర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని తాళ్లపేటలో ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలందరికి మజ్జిగ పంపిణీ చేశారు.

భీమారం: మద్దన్నగూడెం, మైసమ్మగూడెం, పద్మశాలివాడలో కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బూరుగుపల్లి గ్రామంలో జెడ్పీటీసీ తిరుమల ప్రచారం చేశారు.

ఓటేశాక వెళ్లండి ప్లీజ్

వేసవి సెలవులకు వెళ్లొద్దంటూ కోరుతున్న అభ్యర్థులు

సెలవులంటేనే సరదా... అందులో వేసవి సెలవులంటే విద్యార్థులు వారి తల్లిదండ్రులు టూర్ ప్లాన్ చేసుకుంటారు. కుటుంబమంతా పర్యాటక ప్రదేశాలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్తుంటారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులు అమ్మమ్మ, నానమ్మ, ఇంటికి వెళ్దామంటూ మారం చేస్తుంటారు. నిత్యం బీజీగా ఉండే తల్లి దండ్రులు సైతం పిల్లల పేరుతో కాస్త సేదతీరేందుకు ఇదే సమయమని భావిస్తుంటారు. అయితే ఈ వేసవిలో పార్టీల నాయకులు ఓటు వేసిన తర్వాతే టూర్లకు వెళ్లాలంటూ వేడుకుంటున్నారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా, వివిధ పార్టీల నుంచి ఎంపీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల రోజున ఎటూ వెళ్లొదంటూ ఓటర్లను కోరుతున్నారు. ఎన్నికల రోజున మీ ప్రవితమైన ఓటేశాక తీరిగ్గా వెళ్లండంటూ ఓటర్లను రిక్వెస్ట్ చేయడంలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.



టెండర్ ఓటు విధానం...



తమ ఓటు గల్లంతు అయ్యిందని ఫిర్యాదు చేసే వ్యక్తుల కోసం ఎన్నికల సంఘం టెండర్ ఓటు ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఓటరు ఓటు వేయవచ్చు. ఎన్నికల నిబంధనలలోని సెక్షన్ 42 ప్రకారం టెండర్ ఓటు ఏర్పాటు చేశారు. మీరు ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు అప్పటికే మీ ఓటు ఎవరైనా వేస్తే ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అధికారి పరిశీలించి మీ గుర్తింపును ధ్రువీకరిస్తారు. దీని తర్వాత మీరు టెండర్ ఓటును డిమాండ్ చేయవచ్చు. ఇటువంటి పరిస్థితిలో ఈవీఎం ద్వారా ఓటు వేయలేరు. బ్యాలెట్ సాయంతోనే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది.

మీకు తెలుసా

చాలెంజ్ ఓటు విధానం



ఓటింగ్ జరుగుతున్నప్పుడు పోలింగ్ స్టేషన్‌లో చాలెంజ్ ఓటుకు అవకాశం ఉంటుంది. దీని ద్వారా అక్రమ ఓటర్లను అడ్డుకోవచ్చు. ఎన్నికల ఏజెంట్లు ఈ చాలెంజ్ ఓటును ఉపయోగించుకుంటారు. దీని కోసం రూ.2 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఎవరైనా ఓటరు ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌కు వచ్చినప్పుడు అతను నకిలీ ఓటర్ అని ఏజెంట్ అనుమానించినప్పుడు చాలెంజ్ ఓటు ఉపయోగపడుతుంది. పోలింగ్ ఏజెంట్ ప్రిసైడింగ్ అధికారి ఎదుట చాలెంజ్ ఓటు వేస్తాడు. రూ.2 రుసుం చెల్లిస్తాడు. అప్పుడు ఎలక్టోరల్ ఆఫీసర్ ప్రిసైడింగ్ అధికారికి అతను సరైనా ఓటరు కాదని తెలియజేస్తాడు. దీంతో ప్రిసైడింగ్ అధికారి ఓటరు దగ్గరున్న పత్రాలను తనిఖీ చేసి, అవి సరిగా ఉంటే ఓటరుకు ఓటు హక్కు కల్పిస్తారు. ఎన్నికల ఏజెంట్ చెప్పినది నిజమని స్పష్టమైతే ఓటరును ఓటు వేయకుండా అడ్డుకుంటారు.

- దండేపల్లి

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు



కౌన్సిలర్లకు కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

బెల్లంపల్లి, మే 4: పట్టణంలోని పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సమక్షంలో కౌన్సిలర్లు సముద్రాల లావణ్య, శ్రీలత రమేష్, గెల్లి రాజలింగు, సుకేష్ భరద్వాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, నూనె ప్రభాకర్, నెల్లి సమ్మయ్యలు కాం గ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

జిల్లాలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



మంచిర్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం 46.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నస్పూర్ మండలంలో అత్యధికంగా 46.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా జన్నారం మండలంలో 46.0 డిగ్రీలు, హాజీపూర్ 45.7 డిగ్రీలు, దండేపల్లి 45.6 డిగ్రీలు, చెన్నూర 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా ఆయా మండలాల్లో రెడ్ అలర్ట్ జారీ అయ్యాయి. లక్సెట్టిపేట మండలంలో 44.7 డిగ్రీలు, కాసిపేట 44.4 డిగ్రీలు, మంచిర్యాల 44.4 డిగ్రీలు, కోటపల్లి 44.2 డిగ్రీలు, భీమారం 44.1 డిగ్రీలు, వేమనపల్లి 43.9 డిగ్రీలు, నెన్నెల 43.7 డిగ్రీలు, భీమిని 43.6 డిగ్రీలు, జైపూర్ 42.9 డిగ్రీలు, మందమర్రి, కన్నెపల్లి మండలంలో 42.8 డిగ్రీలు, తాండూరు 42.3 డిగ్రీలు, బెల్లంపల్లి మండలంలో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

వందో రోజుకు చేరిన నిత్య జాతీయ గీతాలాపన



జాతీయ గీతాలాపనలో ప్రజలు

బెల్లంపల్లి, మే 4: బెల్లంపల్లి పట్టణంలో జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో పోలీసు శాఖ సహకారంతో నిత్య జనగణమన జాతీయ గీతాలాపన కార్యక్రమం శనివారం వందవ రోజుకు చేరుకుంది. సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జాతీయ గీతాన్ని గౌరవించాలని జనవరి 26న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి చేతుల మీదుగా జాతీయ గీతాలాపన కార్యక్రమం ప్రారంభమైందన్నారు. రోజు ఉదయం 8 గంటలకు జాతీయ గీతాలాపన జరుగుతుందని, దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



జన్నారం, మే 4 : ఏఎంసీ మాజీ డైరెక్టర్ అన్నె కాంతామణి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మంత్రి దనసరి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ల సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంతామణి చేరికపై మండల ప్రధాన కార్యదర్శి పసివుల్లా, ఎంపీటీసీ రియాజుద్దీన్, నాయకులు రియాసత్ ఆలీ, సాధుపాష, గంగన్నయాదవ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

గొడుగుల పంపిణీ



గొడుగులు అందజేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 4 : జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన పెరుగన్నం స్టాల్ వద్ద భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా అధ్యక్షుడు చుంచు రాజ్‌కిరణ్ చిరు వ్యాపారులకు ఉచితంగా గొడుగులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో రోడ్ల పక్కన చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి గొడుగులను అందజేశామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలరావు, వైస్ ప్రెసిడెంట్ సిరిపురం రాజేశం, శ్రీనివాస్, సత్యం, సురేష్ రెడ్డి, మల్లన్న, రవి, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య వ్యవస్థలో మార్పునకు సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న ఆర్థోపెడిక్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 4: వైద్య వ్యవస్థలో మార్పునకు అందరూ సహకరించాలని తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి సభ్యుడు శ్రీనివాస్ యెగ్గెన అన్నారు. శని వారం జిల్లా కేంద్రంలో ఆర్థోపెడిక్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతలు లేని, డాక్టర్లు లేని ఆసుపత్రులు, రెఫరల్ లేదా కమీషన్ వ్యవస్థ సహకారంతో నడిచే ఆసు పత్రుల పై చర్యలు తీసుకుంటామన్నారు. రెఫరల్, కమీషన్ వ్యవస్థ సహకారంతో నడిచే ఆసుపత్రు లకు ఆర్థోపెడిక్ అసోసియేషన్ ద్వారా ఎటువంటి సహకారం లభించదన్నారు. అసోసియేషన్ సభ్యులు డాక్టర్‌లు ఉదయ్, అరవింద్, త్రినాదరావు, సంతోష్, అశోక్, ఓంప్రకాష్, ప్రవీణ్, రాజు, రవి, శ్రీధర్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు మద్దతు

ఏసీసీ, మే 4: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు పీఆర్‌టీయూ తెలంగాణ మద్దతు ఇస్తుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధరణికోట వేణు గోపాల్, నూరినేని గంగాధర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, అభివృద్ధిలో ప్రజా గొంతుకగా నిలబడి ప్రజల్లో చైతన్యం సృష్టించిన తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ పదవికి అర్హుడన్నారు. ఆయనకు పూర్తి మద్దతు ఇస్తున్నామని, పట్టభద్రులు ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

దోసె వేసి ఓట్లు అడిగి...

తాండూర్, మే 4 : మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలో శనివారం పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామితో కలిసి కిష్టంపేట, తాండూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఐబీ కేంద్రంలోని హోటల్‌లో దోసెలు వేశారు. హోటల్‌కు వచ్చిన వారితో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.



ఉపాధిహామీ సమావేశం



మాట్లాడుతున్న ఏపీవో మల్లయ్య

హాజీపూర్, మే 4: హాజీపూర్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 3వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ఏపీవో మల్లయ్య సోషల్ ఆడిట్ సభ్యులు, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి అన్ని గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా 1-4-2023 నుంచి 31-03-2024 వరకు చేసిన రూ. 2.39 కోట్ల విలువ గల దాదాపు 350 పనులను పరిశీలిస్తారన్నారు. వీటికి సంబంధించి నివేదికలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ మహేష్, డీఆర్‌పీలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

నెన్నెల, మే 4: చిత్తాపూర్ బస్టాండ్‌లో మాజీ సర్పంచ్ బత్తిని పద్మ వెంకటేశం అంబలి కేంద్రాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా సొంత ఖర్చులతో అంబలి కేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంబలితోపాటు చల్లని నీరు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రజలు, ప్రయాణికులు, ఉపాధిహామీ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవి తాపం.. తీరిన దాహం...

దండేపల్లి, మే 4: వేసవి తాపం రోజురోజుకు పెరుగుతోంది. మరోవైపు చెరువులు, నీటి కుంటలు, వాగులు ఎండిపోతున్నాయి. వారం రోజుల నుంచి 45 డిగ్రీలపైగా ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఎండ వేడికి మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. ఎండ తీవ్రతకు ఎక్కడ నీళ్ల కనిపించినా అందులో సేద తీరుతున్నాయి. శనివారం దండేపల్లి నల్లకుంట చెరువులో బర్రెల మంద నీటిలో సేద తీరుతూ ఉపశమనం పొందుతున్నాయి.



దండేపల్లి నల్లకుంట చెరువులు బర్రెలు

మందమర్రిటౌన్: ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇక పశు పక్ష్యాదులు తాగునీరు దొరకక తల్లడిల్లిపోతున్నాయి. శనివారం ఎండ తీవ్రంగా ఉండడంతో ఓ కోతి ఇంటి ఆవరణలో ఉన్న పైపులో నీరు వస్తుండగా పైపును పట్టుకుని నీరు తాగి దప్పిక తీర్చుకుంది.



పైపుతో నీరు తాగుతున్న వానరం

పునాదులకే పరిమితమైన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్



పిల్లర్ల స్థాయిలో నిలిచి పోయిన పనులు

మందమర్రి టౌన్, మే 4: పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపంలో రూ.5 కోట్ల నిధులతో ప్రారంభించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనం పునాదులకే పరిమితమైంది. ఈ భవనం అసలు పూర్తవుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ భవనాన్ని కాంట్రాక్టర్ పునాదుల వరకు నిర్మించి వదిలేశారు.

రూ.5 కోట్లతో చేపట్టిన ఈ భవనానికి 80 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు నిలిచిపోయి రెండు సంవత్సరాలు కావస్తోంది. యువతకు స్వయం ఉపాధి శిక్షణ అందించేందుకు చేపట్టిన ఈ భవనం పనులు నిలిచిపోయాయి. ఈ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారనేది ప్రశ్నార్థకంగా తయారైంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా: ఇంజనీర్ అచ్యుత్

మందమర్రిలో అర్ధాంతరంగా పునాదులకే పరిమితమైన భవన నిర్మాణ పనుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. అధికారులు చెప్పిన విధంగా భవిష్యత్‌లో నిర్ణయాలు తీసుకుంటాం.

ఆటో బైక్ ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

భీమారం, మే 4: మండలంలోని కుందారం క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ఆటో, బైక్‌ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. అమరగాని రాజ్ కుమార్ భీమారం నుంచి మంచిర్యాలకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో భీమారంకు చెందిన నస్పూరి రమేష్ ఆటో నడుపుకుంటూ మంచిర్యాల నుంచి వస్తుండగా కుందారం క్రాస్ రోడ్డు సమీపంలో బైక్, ఆటో ఎదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న రాజయ్య చెయ్యి విరిగి తీవ్రగాయాలపాలయ్యాడు. అలాగే రాజుకు తలకు, పక్కటెముకల్లో తీవ్రగాయాలయ్యాయి. అలాగే బైక్‌పై ఉన్న రాజ్‌కుమార్‌కు కాలు విరిగింది. గాయాలపాలైన వారిని స్థానికులు108అంబులెన్స్‌లో మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు. విషయంతెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలుసేకరించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

లారీల కొరత తీర్చాలని రైతుల నిరసన

కోనరావుపేట, మే 4: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో లారీలు రాక కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు పేరుకపోయాయని లారీల కొరత తీర్చాలని శనివారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసి పది రోజులు గడుస్తున్న ధాన్యాన్ని తరలించడం లేదని అన్నారు. దీనివల్ల ధాన్యంబస్తాల వద్ద రాత్రిపూట కాపలా కాయాల్సి వస్తుందని అన్నారు. లారీలు రాక ధాన్యం తరలించడం లేదని అన్నారు. అధికారులు స్పందించి లారీల కొరతను తీర్చి వెంటనే తరలించాలని కోరారు. ఈ సందర్భంగా ధర్మారం రైతులు పాల్గొన్నారు.

వడదెబ్బతో గిరిజన రైతు మృతి


బీర్‌పూర్,మే 4: బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన గిరిజన రైతు శనివారం వడదెబ్బ తగిలి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మంగేళ గ్రామంలోని గోండు గూడానికి చెందిన కొమురం సోము(58)అనే గిరిజన రైతు శనివారం ఉదయం నువ్వు పంట కోయడానికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చి అలసటగా ఉందని పడుకున్నాడు. తరువాత భార్య ఇంటికివచ్చి నీళ్లు తాగుమని సోమును లేపేసరికి మృతిచెంది ఉన్నాడని గ్రామస్తులు తెలిపారు. కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని మాజీసర్పంచ్ చుంచు శారద నరేందర్, గోండుగూడెం ప్రజలు, గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, మే 4: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అనారోగ్య సమస్యలు భరించలేక వృద్ధురాలు బాధ దేవవ్వ(85) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని దేవవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. కొడుకు బాలలింగం వద్ద ఉంటూ కాలం వెల్లదీస్తోంది. ఓవైపు అనారోగ్యం.. మరోవైపు వృద్ధాప్యంతో మనస్తాపానికి గురైంది. శుక్రవారం ఇంటిలో నుంచి బయటకు వెళ్లింది. చీకటి పడిన తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శనివారం శవమై తేలింది. అటు వైపు వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్నారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లారు. స్థానికుల సహాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలు కొడుకు బాలలింగం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇల్లంతకుంట, మే 4: మండలకేంద్రానికి చెందిన చేరాల శ్రీనివాస్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో శనివారం గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై సిద్దిపేటకు వెళ్లి తిరిగి ఇల్లంతకుంటకు వస్తుండగా వెంకట్రావుపల్లె సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడు.





వికాస సంకల్ప సభను విజయవంతం చేయండి



బెజ్జూరులో సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బెజ్జూరు/దహెగాం, మే 4: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో ఆదివారం నిర్వహించే వికాస సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం బెజ్జూరు, దహెగాంలలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఈ సభకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రానున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలోపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బెజ్జూరులో జరిగిన కార్యక్రమంలో నాయకులు మనోహర్‌గౌడ్, శంకర్, రామయ్య,భిక్షపతి,మోహన్,తిరుపతి, దిలీప్, మల్లేష్,రామయ్య,మహేందర్, జనార్ధన్, సాయి కిరణ్, దహెగాంలో గణపతి, మహేష్, విద్యాసాగర్, ఆర్‌మహేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

దహెగాం, మే 4: మండలకేంద్రం సమీపంలోని వరిధాన్యం కొనుగోలుకేంద్రంలో విద్యుత్‌తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ధాన్యం రాశుల మధ్య తిరిగే రైతులు వాటిని గమనిస్తూ తమ పనులు చేసుకుంటున్నారు. అత్యవసర సమయంలో, ఆదమరిచి పనులు చేస్తున్నప్పుడు రైతులు ప్రమాదబారిన పడే అవకాశాలున్నాయి. కాబట్టి ప్రమాదాలు జరుగక ముందే విద్యుత్‌శాఖాధికారులు స్పందించి విద్యుత్‌వైర్లను సరిచే యాలని రైతులు కోరుతున్నారు.

చెట్టు నీడే బస్ షెల్టర్



కొత్తగూడ కోటారివద్ద చెట్టు నీడన బస్సుకోసం వేచిఉన్న ప్రయాణికులు

కెరమెరి, మే 4: మండలంలోని పలు గ్రామాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని పలుగ్రామాల నుంచి జిల్లాకేంద్రం అయిన ఆసిఫాబాద్‌కు వివిధపనుల నిమిత్తం ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. కొత్తగూడ, కోటారి, సావర్‌కేడ ఎక్స్‌రోడ్, బారేమోడి, మెట్టపిప్పిరి గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేవు. బస్‌షెల్టర్లు నిర్మించాలని కోరుతున్నా ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని ఆయాగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండుటెండల్లో 'ఉపాధి' కూలీల వెతలు

జైనూర్, మే 4: మండలంలోని పవర్‌గూడలో ఉపాధి కూలీలు మండుటెండలో ఉపాధిపనికి వెళ్తున్నారు. కుటుంబ పోషణకోసం వారు ఉదయం 8గంటలకు పనికివెళ్లి మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి తిరుగుముఖం పడుతున్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' వారిని పలకరించగా 'ఉపాధి' పనులు చేస్తున్నప్ప టికీ రెగ్యులర్‌గా వేతనాలు రావడం లేదన్నారు. ఉపాధిహామీ పథకం ప్రారంభంలో వారంవారం డబ్బులు పోస్టల్‌ఖాతాలో జమ అయ్యేవన్నారు. కానీ కొన్ని సంవత్సరాల నుంచి కూలి డబ్బులు ఆలస్యంగా అందుతున్నాయన్నారు. అప్పుడే అటుగా వచ్చిన గ్రామపంచాయతీ తాజామాజీ సర్పంచ్ గేడాంవనిత కూలీలకు బాసటగా నిలిచారు. కూలీలు ఎండల నుంచి రక్షణకు కొన్నిసూచనలు అందించారు. ఉదయం 7గంటలకు ఉపాధి పనులకువెళ్లి 10గంటలలోపు ఇంటికి తిరిగిరావాలన్నారు. ఇంటికెళ్లగానే కొంతసేపు విశ్రాంతి తీసుకొని నీరు తాగాలన్నారు. అదేవిధంగా కూలీల వేతనాల్లో జరుగుతున్న జాప్యంపై సంబంధిత అధికారులను సంప్రదించి న్యాయం చేస్తామన్నారు.









మైనార్టీ విద్యార్థినులకు సన్మానం

జన్నారం, మే 4: ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన మైనార్టీ విద్యార్థినులు మదిహనాజ్, అనంఅఫ్రోజ్, కరీనా, తమన్నానాజ్, ఇషా షాజిలీలను శనివారం జన్నారంలో మైనార్టీ నాయకులు సన్మానించారు. ఎంపీటీసీ మహ్మద్ రియాజోద్దీన్, పసివుల్లా, అబ్దుల్ రజాక్, సాధుపాషా, రియాసత్ అలీ,తహసత్అలీ, ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

హాజీపూర్, మే 4: పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గోమాసే గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. శనివారం వేంపల్లి పద్మావతి గార్డెన్‌లో మంచిర్యాల అసెంబ్లీ విస్తృత స్థాయి బూత్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త ఇంటింటికి వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గోనె శ్యాంసుందర్‌రావు, సుహాసిని రెడ్డి, మల్లారెడ్డి, రజనీష్ జైన్, పురుషోత్తం, మల్లేష్, పాల్గొన్నారు.

దండేపల్లి: దేశంలో సుపరిపాలన ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. శనివారం రెబ్బనపల్లి, నెల్కివెంకటాపూర్, దండేపల్లి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలన్నారు. ఉపాధిహామీ పని ప్రదేశాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలందరికి ఉచితంగా వ్యాక్సిన్ అందించిన ఘనత మోదీయే అన్నారు. గోపతి రాజయ్య, సురేష్, గురువయ్య పాల్గొన్నారు.

కన్నెపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ కోరారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. రామయ్య యాదవ్, పుల్లూరి రాజయ్య, అజ్మీర శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని మద్దికల్‌లో శనివారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. నాయకులు శంకర్, బాపు, సందీప్, వినోద్, విజయ, స్వరూప్, మల్లేష్, సతీష్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: అమరావదిలో శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద శని వారం బీజేపీ కార్యాలయాన్ని నాయకులు వెంకటరమణ, దుర్గం అశోక్, జాడి తిరుపతిలు ప్రారంభించారు. బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. చారి, మధు, శ్రీనివాస్, లక్మీ, రాజయ్య, పాల్గొన్నారు.

గోడం నగేష్‌ను గెలిపించాలి

జన్నారం, మే 4 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను గెలిపించాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు రమేష్ రాథోడ్ అన్నారు. శనివారం పొనకల్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మదుసూదన్‌రావు, శంకరయ్య, బద్రినాయక్, గోలి చందు గోపాల్, ప్రవీణ్, సూర్యం, మల్లేష్, జగన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



మందమర్రిటౌన్, మే 4: పట్టణంలోని జాతీయ రహదారి వద్ద కాంగ్రెస్ నాయకులు శనివారం పాదయాత్ర నిర్వహించారు. పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని నినాదాలు చేశారు. వ్యాపారులను, ప్రజలను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. యాపల్,పాత బస్టాండ్ ఏరియా, మారుతినగర్, ఊరు మందమర్రిలో ప్రచారం నిర్వహించారు. సొత్కు సుదర్శన్, ఉపేందర్‌గౌడ్, బండి సదానందం యాదవ్, భాస్కర్, కడారి శ్రీధర్, ప్రభాకర్‌రావు, పాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా అందని పౌష్టికాహారం

● సాంకేతిక సమస్యలతో పోషణ దూరం ● యాప్‌లో విద్యార్థుల పేరు నమోదైతేనే ఇండెంట్ ● ప్రతీ నెల 30 శాతం మందికి అందని పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకుంటున్న మహిళలు

కాసిపేట, మే 4: పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నారు. అయితే పాలు, కోడిగుడ్లు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం కొత్తగా యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. లబ్ధిదారులకు సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని తెచ్చిన ఈ యాప్‌లు సాంకేతిక సమస్యలతో అడ్డంకిగా మారాయి. యాప్‌లలో నమోదైతేనే ఇండెంట్ వస్తుంది. లేదంటే ఈ కేంద్రానికి సరుకుల కేటాయింపు జరగదు. దీంతో అధికారులు, టీచర్లు, లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, చెన్నూరు ప్రాజెక్టుల పరిధిలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 4359 మంది గర్భిణీలు, 4580 మంది బాలింతలు ఉన్నారు. ఏడాదిలోపు పిల్లలు 4461 మంది, ఏడాది నుంచి 3 ఏండ్ల లోపు పిల్లలు 19,579 మంది ఉండగా, 3 నుంచి 6 ఏండ్లలోపు పిల్లలు 19,848 మంది ఉన్నారు. పిల్లలకు బాలామృతం, గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మీ పేరుతో అనుబంధ పోషకాహారాన్ని అందిస్తున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలతోపాటు కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో 30 శాతం మందికి అనుబంధ పోషకాహారం అందక గిరిజన మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు.

అనుబంధ పోషకాహారం పంపిణీ ఇలా..

గర్భిణీలు, బాలింతలకు ప్రతీ నెల 30 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, 3 కిలోల బియ్యం, అరకిలో కందిపప్పు, 400 గ్రాముల మంచి నూనె అందించాలి. అలాగే 1 నుంచి 3 ఏండ్లలోపు పిల్లలకు 16 గుడ్లు ఇంటికి ఇవ్వాలి, 3 నుంచి 6 ఏండ్లలోపు పిల్లలకు రెండున్నర కిలోల బాలామృతం, రోజు ఒక గుడ్డు చొప్పున అందించాలి. పిల్లల హాజరు శాతం ఎక్కువగా ఉన్న చోట ఆయాలు ఇంటి వద్దనే వంట చేసుకుని కేంద్రానికి తెచ్చి వడ్డిస్తున్నారు. దీంతో పిల్లలకు సరైన భోజనం అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. కాగా మిగిలిన వారికి ఇండెంట్ సరిగ్గా లేకపోవడంతో వచ్చిన సరుకులతోనే అంగన్‌వాడీ సిబ్బంది సరిపెడుతున్నారు.

యాప్‌లతో అవస్థలు...

గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల హాజరును రిజిష్టర్‌లలో నమోదు చేసేవారు. దీని ఆధారంగానే వారికి పోషణ ఖరారయ్యేది. ప్రభుత్వం తాజాగా యాప్‌లను రూపొందించింది. రోజు యాప్‌లో లబ్ధిదారులను నమోదు చేయాలి. కేంద్రం రూపొందించిన పోషణ వాకర్ యాప్‌లో రోజు ఆధార్ వెరిఫికేషన్, ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్) యాప్‌లో లబ్ధిదారుల ముఖ హాజరు నమూనా చేయాలి. ఇలా నమోదు చేసేటప్పుడు అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. యాప్‌లో నమోదు చేసే సమయంలో ఏ రోజుకారోజు ఎగ్జిస్టింగ్ అని వస్తుంది. దీంతో కొన్ని సార్లు పేర్లు నమోదు కావడం లేదు. ఒక్కోసారి పేర్లు నమోదైంది లేనిది తెలియడం లేదు. ఇండెంట్ వచ్చిన తర్వాత చూసుకుంటే కొంత మందికి సరుకులు తగ్గి వస్తున్నాయి. దీంతో టీచర్లు లబ్ధిదారులతో ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది వాపోతున్నారు.

ఒకటే యాప్ ఉండేలా చూడాలి

భానుమతి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన రెండు యాప్‌ల వల్ల లబ్ధిదారుల పేర్లు నమోదు చేయడంలో ఇబ్బందులు పడుతున్నాం. ఒకటే యాప్ ఉండేలా చూడాలి. పాత మొబైల్‌లు ఈ యాప్‌లకు సపోర్టు చేయడం లేదు. సాయంత్రంలోగా యాప్‌లలో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయకుంటే ఉద్యోగుల జీతాల్లో కోతలు విధిస్తామని అధికారులు భయపెడుతున్నారు. నెట్‌వర్క్ లేని గ్రామాల్లో ఉద్యోగులు పేర్లను నమోదు చేయడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ఫోన్‌లను అందించాలి.

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రక్షాళన చేస్తున్నాం

చిన్నయ్య, జిల్లా సంక్షేమాధికారి



జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రక్షాళన చేపట్టాం. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిని హెచ్చరించాం. అంగన్‌వాడీ కేంద్రా ల్లోని బాలింతలు, గర్భిణీలకు, పిల్లలకు వంద శాతం అనుబంధ పోషకాహారం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అంగన్‌వాడీ కేంద్రా లను ఆధునీకరించేందుకు నాలుగు ప్రాజెక్టుల్లో 40 కేంద్రాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. యాప్‌లలో పాత మొబైల్స్‌లో పేర్లు నమోదు చేయడంలో ఇబ్బందులు పడుతున్నారు.

గోత్రాలగూడెం గోసలు తీరేదెప్పుడో..



భీమారం మండలంలోని గోత్రాలగూడెం

● మట్టి రోడ్డుతో వానాకాలంలో ఇబ్బందులు
● రేషన్ సరుకుల కోసం అవస్థలు

భీమారం, మే 4: మండల కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న గోత్రాలగూడెం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గూడెంలో 36 ఇండ్లు ఉండగా సుమారు 250 మంది జనాభా ఉన్నారు. ఖాజీపల్లి గ్రామపంచాయతీలో గోత్రాలగూడెం అనుసంధానంగా ఉంది. ఈ గూడెంలోని ప్రజలు నాటికలు, భాగోతాలు, కథలు చెబుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ గూడెంలో విద్యుత్, తాగు, సాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటివే కాకుండా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. ఒకే ఇంట్లో మూడు నాలుగు కుటుంబాలు నివసించాల్సిన పరిస్థితి ఉంది. వీధి దీపాలు లేక చీకటిలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అలాగే గూడెంలో రేషన్ షాపు లేకపోవడంతో బియ్యం కోసం రెండు న్నర కిలోమీటర్లదూరంలో ఉన్న ఖాజీపల్లికి వెళ్లాల్సి వస్తుంది. భీమా రం నుంచి ఆవడం వరకు ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మించగా, ఖాజీపల్లి నుంచి గోత్రాలగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని గత ప్రభుత్వం రూ. 1.68 కోట్లు మంజూరు చేసినా ఇప్పటి వరకు నిర్మించలేదు. దీంతో ప్రజలకు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం బురద రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. డ్రైనేజీలు లేక మురుగునీరు ఇండ్ల ముందు నుంచి వెళ్తుంది. అత్యవసర పరిస్థి తుల్లో అంబులెన్స్ రావడం కూడా కష్టంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు లేవని పేర్కొన్నారు. గూడెంలోని సమస్యలను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం గూడానికి వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని చెబుతారే తప్ప ఏం చేయరని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గోత్రాల గూడెంలోని సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ పథకాలను అందించాలని ప్రజలు కోరుతున్నారు.



గోత్రాలగూడెంకు వెళ్లే మట్టి రోడ్డు

సమస్యలను పరిష్కరించాలి : తాళ్ల వేణు, గోత్రాలగూడెం



గోత్రాలగూడెంలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. రేషన్ దుకాణం లేకపోవడంతో ఖాజీపల్లికి వెళ్లాల్సి వస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. డ్రైనేజీలు లేక వర్షాకాలంలో వర్షం నీరు ఇండ్లలోకి చేరుతుంది. రహదారి లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోత్రాలగూడెంలోని సమస్యలను పరిష్కరించాలి.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసిన ఉద్యోగులు



ఓటేసిన ఉద్యోగులు

కాగజ్‌నగర్, మే 4: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు శనివారం పోస్టల్ బ్యాలెట్ ఓట్ చేశారు. ఉద్యోగి తన గుర్తింపుకార్డు, దరఖాస్తు చేసుకున్న ఫారం తదితర వాటిని చూసి సిబ్బంది ఓటింగ్‌కు అనుమతించారు. ఈ ప్రక్రియను అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఆర్డీవో సురేష్ సందర్శించి పలు సూచనలు చేశారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన వారితో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్ రూరల్, మే 4: ఆసిఫాబాద్ నియోజక వర్గంలోని గుడెన్‌ఘాట్ గ్రామ ప్రజలు జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు సమక్షంలో పెద్దఎత్తున బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు రమేష్, గంగన్న, కుమార్, తిరుపతి, రమేష్, సాయి, పుష్ప, సుమలత, మంజుల తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

ఆసిఫాబాద్‌రూరల్, మే 4: మండలంలోని బూర్గుడ గ్రామ సమీపంలోని బీఈడీ కళాశాల దగ్గర జాతీయ రహదారిపై శనివారం లారీ ఢీకొని మూడు గేదులు మృతిచెందాయి. చిర్రకుంట గ్రామానికి చెందిన మద్దెల రాజన్న గేదెలు మేత కోసం రోడ్డు దాటుతుండగా మహారాష్ట్ర నుంచి అనంతాపూర్‌కు వెళ్తున్న లారీ గేదెలను ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మరో గేదెకు తీవ్ర గాయాలు అయ్యాయి.

రెబ్బెనలో ఎక్సైజ్ దాడులు: ఒకరిపై కేసు నమోదు

రెబ్బెన, మే 4: మండలంలోని ఎన్టీఆర్‌కాలనీ, దేవులగూడలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 1800లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం ఎస్సై రమేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో దాడులు నిర్వహించగా, నాటుసారా తయారు చేస్తున్న సుజాతపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో కానిస్టేబుళ్లు సురేష్, రజిత, ధను, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే 'ఉపాధి హామీ' పనులు



కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్



జైనూరు: దబోలిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిర్పూర్(టి), మే 4: కాంగ్రెస్ హయాంలోనే ఉపాధి హామీ పనులు మొదలయ్యాయని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని టోంకిని, పారిగాం, లక్మీపూర్ తదితర గ్రామాల్లో జరుగు తున్న ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లా డారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకం వచ్చిందన్నారు. మళ్లీ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కూలీలకు రోజుకు రూ.400 ఇచ్చే చట్టం తీసుకు వస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, నాయ కులు తిరుపతి, అబ్దుల్ అఖిల్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం

జైనూర్: మండలంలోని డబోలి, షేకుగూడ, గారేన్‌గూడ తదితర గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వైస్‌ఎంపీపీ షేక్‌రషీద్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ మాట్లాడుతూ ఇంటి ఆడపడుచుగా ఆత్రం సుగుణను భారీ మెజా ర్టీతో గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ఆత్రం సుగుణ ఉపాధ్యాయురాలిగా, ఉద్యమకారిగా పేదల కోసం ఎన్నో సందర్భాల్లో గళం విప్పారన్నారు. కార్యక్రమంలో నాయకులు పెందుర్ ప్రకాష్, కనక గంగారాం, ఆడ అమృ త్‌రావ్, అర్క యాదవ్‌రావ్, ఫైమద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని పలుగ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ముగియగానే రైతులకు రుణమాఫీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

బెజ్జూరు: ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని టీపీసీసీ మెంబర్ హర్షద్‌హుస్సేన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నాగులవాయి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరుగ్యారెంటీ పథకాలను చూసి ఓటు వేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాయి, నాయకులు శేఖర్, నందయ్య, తిరుపతి, శేఖర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



బెజ్జూరులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కుట్టు మిషన్ కుడుతూ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

చింతలమానేపల్లి/బెజ్జూరు, మే 4: చింతలమానేపల్లి మండలంలోని డబ్బా, బారెగూడ్ల, బెజ్జూరు మండలంలోని కుకుడ, అంబగట్టు గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు, జడ్పీటీసీ పుష్పలత పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీసీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ అభ్యర్థి సక్కును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, లంచు, విజయ్,మున్ను, పాపయ్య, విజయ్, సావిత్రి, రాజారాం, బాపురావు, అశోక్, వినోద్, శ్రీకాంత్, సంతోష్, బెజ్జూరులో భాగ్య, రాజన్న, సురేష్‌గౌడ్, సంజీవ్, గణేష్, రామయ్య, సుఖారాం, ధర్మయ్య, సుబ్బారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వారసంతలో ఎమ్మెల్యే ప్రచారం

ఆసిఫాబాద్ రూరల్: ఆసిఫాబాద్ పట్టణంలో శనివారం నిర్వహించిన వారసంతలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పట్టణంలోని వాణిజ్య, వ్యాపార సంస్థల వారి వద్దకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆమెవెంట పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, నాయకులు రవీందర్, సరస్వతి, అమర్, నిసార్,అహ్మద్, భీమేష్, రవి, అశోక్, కార్తీక్, శైలు, సలాం, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

వాంకిడి: పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని జడ్పీటీసీ అజయ్ కుమార్ కోరారు. శనివారం మండలంలోని జైత్పూర్, బెండార తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీమెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పీఏసీఎస్ చైర్మన్ పెంటయ్య, నాయకులు తుకారాం, వినోద్, దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన వారసంత

సిర్పూర్(టి), మే 4: మండలంలో శనివారం జరిగిన వారసంత ఎండ కారణంగా వెలవెలబోయింది. ఎండ మూలంగా వారసంతకు ప్రజలు రాకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వరకు కూడా వ్యాపారాలు జరకపోవడంతో నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోయారు.

ప్రమాదం పొంచి ఉన్నా.. పట్టింపేది?

లింగాపూర్, మే 4: వంతెనలు, కల్వర్టుల వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. మారుముల గ్రామాలకు వేసిన రోడ్లు, వంతెనలు వర్షాకాలంలో వచ్చిన వరద తాకిడికి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. అటువంటి వాటికి అధికారులు మరమ్మతులు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మండలంలోని లొద్దిగూడా, ఫూల్‌సింగ్ తండా, పిట్టగూడా, కీమానాయక్‌తండా, గోపాల్‌పూర్ ప్రధానరహదారి మధ్యలోని వంతెన కొంతభాగం గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. నెలలు గడుస్తున్నా దానిని మరమ్మతు చేయడం ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం కల్వర్టు కొట్టుకుపోయిన స్థలంలో ప్రమాద సూచికలు కూడా పెట్టలేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు ఆదమరిస్తే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



లొద్దిగూడా ఫూల్‌సింగ్ తండా వద్ద వరదకు కొట్టుకుపోయిన కల్వర్టు

ఉగ్ర భానుడు.. ఉపాధి పనులు

- మండుటెండతో ఉపాధి కూలీలు సతమతం
- నీడ లేదు.. ఇంటి నుంచే తాగునీరు
- పనిప్రదేశాల్లో కనీస వసతులు కరువు

బెజ్జూరు, మే 4: గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. కూలీలకు క్షేత్రస్థాయిలో కనీస సౌకర్యాలు అందక పోవడంతో మండుటెండలో ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు భానుడి ఉగ్రరూపం కారణంగా పనికి వెళ్లే కూలీలు తీవ్రఅవస్థలు పడుతున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక కూలీలు నీరసిస్తున్నారు. పని ప్రదేశాల్లో సరైన వసతులు లేక ఎండకు కూలీలు అల్లాడుతున్నారు. దీంతో ఉపాధి కూలీలు పనికి వెళ్లేందుకు భయపడుతున్నారు. పది రోజులుగా భానుడు ఉగ్రరూపం దాలుస్తుండటంతో గ్రామాల్లో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. పనికి వెళ్తే వడదెబ్బ తగులుతుందేమోనని కూలీలు జంకుతున్నారు. ఇప్పటికే మండలంలో వడదెబ్బతో ఇద్దరు మృతిచెందిన విషయం తెలిసిందే. ఎండ తీవ్రత పెరుగుతున్నా పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. రెక్కల కష్టం మీద ఆధారపడి జీవిస్తున్న కూలీలు మండుటెండలో పనిచేస్తూ అస్వస్థతకు గురవుతున్నారు.



వేతనం పెంచినా కానరాని వసతులు..

తాజాగా కూలీలకు చెల్లించే మొత్తాన్ని రోజుకు రూ.300లకు పెంచారు. కానీ పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పనలో విఫలమవుతున్నారు. వేసవి ఎండలు ముదరడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తక్కువ సంఖ్యలోనే కూలీలు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో మాదిరి నీడ, నీటి సౌకర్యాలు కనిపించడం లేదు. దీంతో ఉపాధి పనులు చేపట్టాలంటేనే ఇబ్బందిగా ఉందని కూలీలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పనిప్రదేశంలో వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

పరిస్థితి ఇలా..

జిల్లా వ్యాప్తంగా మొత్తం జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు 1,23,423, నమోదైన కూలీల సంఖ్య 2,47,870, మహిళలు 1,21,912, పురుషులు 1,25,950 మంది ఉన్నారు. ఇందులో హాజరవుతున్న వారు 93,068 మంది కూలీలు ఉన్నారు. జిల్లాలో కూలీల సంఖ్య పెంచడంపై అధికారులు, సిబ్బంది నిత్యం సమీక్షలు చేస్తున్నారు. కానీ కూలీలకు సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించడం లేదు. జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద చెరువుల్లో పూడికతీత, చెరువు కట్టల నిర్మాణం, మొక్కల సంరక్షణ తదితర పనులు చేస్తున్నారు. కానీ పని ప్రదేశాల్లో ఏమాత్రం సౌకర్యాలు లేక కూలీలు ఎండకు అల్లాడుతున్నారు. ప్రభుత్వం మాత్రం కూలీలు పనిచేసే చోట అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదని కూలీలు పేర్కొంటున్నారు.

పత్తాలేని మెడికల్ కిట్లు..

గ్రామాల్లో వేసవిలో వ్యవసాయ పనులు తగ్గుతుండటంతో చాలా మంది ఉపాధి పనుల వైపు మొగ్గుచూపుతున్నారు.అయితే ఎండాకాలంలో ఉపాధి పనులు చేయడం చాలా కష్టం. దీంతో ప్రభుత్వం నిబంధనలు సడలించింది. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12వరకు కూలీలు పనులు చేసి ఇళ్లకు చేరుతున్నారు. అయితే ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి పనుల్లో ఎక్కువగా చెరువు పూడికతీత, మట్టి కట్టలు పోయడం వంటివి చేపిస్తున్నారు. అయితే పని ప్రదేశంలోని పరిసరాల్లో చెట్ల నీడ కూడా లేకపోవడంతో ఎండకు నీరసించిపోతున్నారు. భోజనం చేయడానికి, అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి ప్రభుత్వం గుడారాలను పంపిణీ చేసేది. వాటిని క్షేత్ర సహాయకులు నిత్యం పని ప్రదేశానికి తీసుకెళ్లి నీడ ఏర్పాటు చేయాలి. తాగునీటిని తెచ్చుకునేవారికి నగదు కూడా చెల్లించేది. 2017తర్వాత ఉపాధి పథకంలో మెడికల్ కిట్లు, షామియానాల పంపిణీ లేకుండా పోయింది. గతంలో పథకంలో శాశ్వత శ్రమశక్తి సంఘాలుగా ఉన్నప్పుడు గడ్డపారలు, పార, తట్టలను అందించారు. ఇప్పుడు వాటి పంపిణీ కూడా లేకుండా పోయింది. కూలీలకు గాయాలైన ప్పుడు, వడదెబ్బ తగిలినప్పుడు ప్రథమచికిత్స చేయడానికి కిట్లను ఉపయోగించేవారు. ప్రస్తుతం వాటి పంపిణీ కూడా లేకపోవడంతో కేవలం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది అదికూడా లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

సమస్యలు తీర్చాలి..



గుర్లె లింగుమేర, ఉపాధి కూలీ

పని చేసేచోటికి ఇంటి నుంచే నీళ్లు తెచ్చుకుంటున్నాం. గుడారాలు లేకపోవడంతో ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ మండుటెండల్లో పని ప్రదే శంలో కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయడం లేదు.

అస్వస్థతకు గురవుతున్నాం..



చిప్పకుర్తి వెంకటి, ఉపాధి కూలీ

ప్రతిరోజు ఉదయం 7గంటలకు బయల్దేరి 11గంటల వరకు పని చేస్తున్నాం. ఉదయం 8గంటలకే ఎండ తీవ్రత పెరుగుతుండడంతో పనులు చేయలేకపోతున్నాం. ఈ తీవ్రమైన ఎండలకు ఉపాధి పనులు చేస్తున్న కొందరు అస్వస్థతకు గురవుతున్నారు. పని ప్రదేశంలో నీటి వసతితో పాటు గుడారాలు ఏర్పాటు చేయాలి.

క్షణికావేశంతో ఇద్దరు మహిళల బలవన్మరణం

- భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు
- భరించలేక భార్య ఆత్మహత్య
- అపవాదు భరించలేక మరో మహిళ ఆత్మహత్య



రమ్య(ఫైల్) సరిత(ఫైల్)

సిర్పూర్(టి), మే 4: క్షణికావేశంలో ఇద్దరు మహిళలు తీసుకున్న నిర్ణయాలు వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. మండల కేంద్రానికి చెందిన జాజిరెడ్డి రమ్య(32), దోని సరిత(30) ఇద్దరు వివాహితలు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏఎస్సై రాములు తెలిపినవివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జాజిరెడ్డి రమ్యకు ఆమె భర్తకు మధ్య తరచూ గొడవలు జరుగుతుం డేవి. ఈ వేధింపులు భరించలేక శుక్రవారం రాత్రి రమ్య పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనిం చిన కటుంబీకులు వెంటనే ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమెను అక్కడనుంచి మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అయితే భార్యభర్తల మధ్య జరుగుతున్న గొడవలను ఇరుగుపొరుగు వారికి సరిత చెప్పుతుండడంతోనే అవమానం భరించలేక రమ్య ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో మనస్థాపా నికి గురైన సరిత శనివారం ఉదయం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఇద్దరి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

- టీఎస్ఎన్‌పీడీఎల్ వరంగల్‌శాఖ జనరల్‌మేనేజర్ గౌతం రెడ్డి



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న టీఎస్ఎన్‌పీడీఎల్ వరంగల్ శాఖ జనరల్ మేనేజర్ గౌతం రెడ్డి

కాగజ్‌నగర్, మే 4: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని టీఎస్ఎన్‌పీడీఎల్ వరంగల్‌శాఖ జనరల్‌మేనేజర్ గౌతంరెడ్డి అన్నారు. శనివారం ఆయన కాగజ్‌నగర్ మండలంలోని ఈసుగాం సబ్‌స్టేషన్, గన్నారం ఫీడర్‌తోపాటు పలుచోట్ల ఉన్న విద్యుత్‌సబ్‌స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్‌సేవలు అందిస్తున్న ఉద్యోగులను, సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట డీఈ నాగరాజు, ఏఈ జగన్‌మోహన్, అసిస్టెంట్ ఇంజనీర్ సత్తన్న, జూనియర్ లైన్‌మెన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా అధికారి

వాంకిడి: విద్యుత్‌సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ జిల్లా అధికారి వాసుదేవ్‌రావు సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ ద్వారా గ్రామాలకు జరుగుతున్న విద్యుత్‌సరఫరాను పరిశీలించారు. విద్యుత్‌సరఫరా విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసిఫాబాద్, మే 4: ఏరియర్స్ బాండ్ డబ్బులను కేవలం డ్రైవర్లకు ఇచ్చి మిగతా వారికి చెల్లించకుండా వివక్ష చూపుతున్న ఆర్టీసీ యజమాన్యం చర్యలకు నిరసనగా శనివారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనతెలిపారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అశోక్, ఐబీ అలీ, సంతోష్, నాగభూషణం, అమీద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఆసిఫాబాద్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, మే 4: ఎన్నికల నిర్వహణలో ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ చాలా ముఖ్యమైదని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని పీటీజీ పాఠశాలలో, కాగజ్‌నగర్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల కోసం ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాల కమిషనింగ్ ప్రక్రియను ఆయన సహాయఎన్నికల అధికారులు దాసరివేణు, దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల బరిలో 12మంది అభ్యర్థులు ఉన్నందున నోటాతో కలిపి మొత్తం 13బటన్లు ఓటింగ్ యంత్రంలో పనిచేసేలా చూడాలన్నారు. మిగితా బటన్లకు సీలు వేయాలన్నారు. ఓటింగ్ యంత్రంపై అభ్యర్థులవివరాలు, గుర్తులు స్పష్టంగా కనబడేలా ఉండాలన్నారు. ఓటింగ్ యంత్రంలో ప్రతి ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలని ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. కాగజ్‌నగర్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ కమిషనింగ్ ప్రక్రియకు 40టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి టేబుల్‌కు సెక్టార్ అధికారులు ఇంచార్జిగా ఉండి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేస్, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు హోం ఓటింగ్



వృద్ధుల ఇళ్లకు వెళ్తున్న సిబ్బంది

పెంచికలపేట, మే 4: మండలంలోని పలుగ్రామాల్లో శని వారం వృద్ధులు తమ ఓటు హక్కును హోం ఓటింగ్ ద్వారా సద్వినియోగం చేసుకున్నారు. ఆర్ఐ సురేష్ మాట్లాడుతూ మండ లంలో మొత్తం 29మంది వృద్ధులు ఉండగా ఇప్పటి వరకు 25మంది హోం ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదే శాల మేరకు ఇంటింటికి తిరుగుతూ వీడియో తీస్తూ, పోలీసు సిబ్బందితో పకడ్బందీగా హోంఓటింగ్ నిర్వ హిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

ఆసిఫాబాద్, మే 4: ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని ప్రజలకు అంబలి చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఉబేద్‌బీన్ యాహియా, నాయకులు సరస్వతి, వెంకన్న, భీం రావు, అహ్మద్, అబ్దుల్లా, అలీబీన్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



అంబలి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నేడు కాగజ్‌నగర్‌కు కేంద్రమంత్రి అమిత్‌షా రాక

- ఎస్పీఎం క్రీడా మైదానంలో భారీ బహిరంగ సభ
- ఉమ్మడిజిల్లా నుంచి భారీగా తరలిరానున్న కార్యకర్తలు



సభకు జరుగుతున్న ఏర్పాట్లు



సర్‌సిల్క్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్

కాగజ్‌నగర్, మే 4: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం జరుగనున్న వికాస సంకల్ప సభకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రానున్నారు. మధ్యాహ్నం 1గంటకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సభ ప్రారంభం కానుంది. 2.00గంటలకు హెలిక్యాప్టర్‌లో అమిత్‌షా రానున్నారు. సర్‌సిల్క్ ఏరియాలోని శిశుమందిర్ పాఠశాల, వెల్ఫేర్ గ్రౌండులో రెండు హెలిప్యాడ్‌లను ఏర్పాటుచేశారు. ఈప్రాంతాన్ని పూర్తిగా ఎన్ఎస్‌జీ కమాండోలు, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సు ఆధీనంలోకి తీసుకుంది. సర్‌సిల్క్ మార్గం నుంచి ఎస్పీఎం క్రీడా మైదానం వరకు అడుగడుగునా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సభను విజయవంతం చేయాలి..
- బీజేపీ జిల్లాఅధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

ఆదివారం కాగజ్‌నగర్‌లో నిర్వహించే వికాస సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. వికాస సంకల్ప సభకు ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

దుప్పిని కాపాడిన అటవీ సిబ్బంది

పెంచికలపేట, మే 4: అడవిలో సంచరంచే సాంబార్ దుప్పి (కణుజ)ని అడవికుక్కల బారినుంచి ఫారెస్టు వాచర్లు లచ్చయ్య, సాగర్ రక్షించారు. టైగర్‌ట్రాకింగ్‌లో భాగంగా అగర్‌గూడ బొక్కి వాగు వద్దకు వెళ్లిన వాచర్లు అడవి కుక్కలు దుప్పిని తరమడం గమనించారు. వెంటనే వారు వాటిని తరిమేసి దుప్పిని కాపా డారు. అటవీ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి దుప్పిక్షేమంగా ఉందని నిర్ధారించుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమీపంలోని అగర్‌గూడఅడవిలో వదిలిపెట్టారు.



దుప్పిని అటవీ ప్రాంతంలో వదిలి పెడుతున్న అటవీశాఖ సిబ్బంది

దళారులను నమ్మి మోసపోవద్దు

- జిల్లా సహకార ఆడిట్ అధికారి మహిమూద్ అలీ

పెంచికలపేట, మే 4: రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా సహకార ఆడిట్ అధికారి మహిమూద్ అలీ అన్నారు. శనివారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గొంట్లపేట, ఎల్లూరు, కొండపలిల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలనులాయన పరిశీలించారు. నాణ్యమైన వరి ధాన్యంను కొనుగోలు కేంద్లాకు తీసుకు వస్తే కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. ఆయనవెంట సబ్‌డివిజనల్ అధికారి శ్యాముల్స్ సత్యనారాయణగౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, మహేష్, వెంకటేష్, జలపతి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



అన్నిరంగాల్లో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు విఫలం

- హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

మందమర్రిటౌన్, మే 4: సింగరేణిలో గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అన్నిరంగాల్లో పూర్తిగా విఫలమయ్యాయని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. శనివారం మందమర్రిలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఇంతవరకు గుర్తింపు ధ్రువీకరణ పత్రం తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సంస్థపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదన్నారు. సింగరేణిలో గనులు మూతపడుతున్నాయని, నూతన గనుల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్మికులు 40వేల మంది ఉంటే 60వేల క్వార్టర్లు ఉన్నాయని, 20వేల క్వార్టర్ల ఎవరికి ఇచ్చారో సింగరేణి యాజమాన్యానికి తెలియాలన్నారు. సంస్థకు సంబంధం లేని వ్యక్తులకు క్వార్టర్లు ఇస్తున్నారన్నారు. గుర్తింపు సంఘంకార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. నాయకులు బోనాల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, ముకేష్, సారయ్య, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంఎస్ ఏరియా కమిటీ

మందమర్రి ఏరియా హెచ్ఎంఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏరియా ఉపాధ్యక్షుడిగా జక్కబోయిన శ్రీనివాస్, కేకే ఓసీపీ పిట్‌సెక్రెటరీగా మౌనిక, సీఎస్పీ పిట్ సెక్రెటరీగా రామస్వామిని ఎన్నుకున్నారు.

పని వేళలను మార్చండి: ఏఐటీయూసీ



శ్రీరాంపూర్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మే 4: వేసవికాలం దృష్ట్యా ఓసీపీలలో షిఫ్టుసమయాలను మార్చాలని ఏఐటీయూసీ ఉపప్రధానకార్యదర్శులు కె వీర భద్రయ్య, ముష్కెసమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. ఈ మేరకు వారు శ్రీరాంపూర్ ఓసీపీలో శనివారం అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలోని ఏడు జిల్లాలలో ఇప్పటికే 45డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో మరింత ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. ఈ తరుణంలో ఓసీపీలలో పనిచేసే కార్మికులకు వడదెబ్బ తగిలి, ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి కార్మికుల పని వేళలు మార్చాలన్నారు. యాజమాన్యం స్పందించి షిఫ్ట్ సమయాల్లో మార్పులు చేయకపోతే సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఓసీపీ పిట్ కార్యదర్శి మోతె లచ్చయ్య, కాంట్రాక్టు కార్మికసంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

మార్చకపోతే ఆందోళనలు ..

మందమర్రిటౌన్: ఎండలు అధికంగా ఉన్నందున తప్పనిసరిగా ఉద్యోగులపనివేళలు మార్చాలని శనివారం ఏఐటీయూసీ నాయకులు కేకేఓసీపీ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే తాము యాజమాన్యానికి పనివేళలు మార్చాలని చెప్పినా పట్టించుకోక పోవడం సరికాదన్నారు. రెండురోజుల్లో యాజమాన్యం స్పందించకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు సుదర్శన్, కంది శ్రీనివాస్, ప్రభాకర్, సంపత్, బానయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: వేసవికాలందృష్ట్యా కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, అవుట్ టైమ్‌ను 3.30నుంచి 3గంటలకు తగ్గించాలన్నారు. అవుట్‌డోర్ పనివేళలు ఉష్ణో గ్రతలు తగ్గేవరకు మార్పు చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి కోరారు.

కార్మికులు మధ్యాహ్నభోజనం చేసేటప్పుడు క్యాంటీన్‌ను తెరిచి ఉంచాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు. మహిళాకార్మికుల వాష్‌రూమ్‌లో నీరుసరఫరా కావ డంలేదని వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. అనంతరం ఏరియా వర్క్‌షాప్‌లో డీజీఎం రవీందర్‌కు వినతిపత్రం అందించారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ ఓసీపీ నందు ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం ఓసీపీ, సీహెచ్‌పీలలో పనిచేస్తున్న కార్మికుల పనివేళలు మార్చాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేయాలని, రెస్ట్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గనిమేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మేనేజర్ సానుకులంగా స్పందించి విషయాన్నిపై అధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్రకార్యదర్శి అక్బర్‌అలీ, వైస్‌సెక్రెటరీ లింగయ్య, ఏఐటీయూసీ కార్యకర్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, మిట్ట పోశం పాల్గొన్నారు.

రెబ్బెన: ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌తిరుపతి, వైస్‌ప్రెసిడెంట్ బయ్య మొగిలి మాట్లాడుతూ కోల్‌బెల్ట్ ఏరియాలో ఎండల తీవ్రత అధికంగా ఉందన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి డ్యూటీ టైమింగ్ వెంటనే తగ్గించేట్టు సర్క్యులర్ జారీచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, దివాకర్, ఓదేలు, అన్నం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.